సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 7 । జూలై । 2023



పెరిగిన జీతం కోతకే..
సింగరేణి కార్మికుల కొత్త వేతనాలపై పన్ను పోటు పడింది. ఇటీవల 11వ వేతన ఒప్పందంలో వేతనాలు పెరిగాయి. కానీ పెరిగిన వేతనంలో అధిక శాతం ఆదాయ పన్నుకే పోతోంది. 8లో▸



వానొస్తే రోడ్డంతా బురద
మంచిర్యాల మున్సిపాల్టీతోపాటు పలు మండలాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0 /25.0
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఎల్లంపల్లి'కి వరదనీరు



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటీవల కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఉన్న ఎల్లంపల్లి జలాశయానికి చేరుతోంది. గురువారం రాత్రి వరకు 20.175 టీఎంసీల పూర్తి స్థాయి నీటి నిల్వ మట్టానికి గాను 11.935 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కింద పార్వతి ప్రాజెక్ట్ నుంచి 11 వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి దాదాపు 8 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

మెడికల్ కళాశాల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఏఈఈ అనూషతో నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఎస్ఈ శేషారావురాథోడ్ ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 నెలల కాలంలో భవన నిర్మాణాలు పూర్తయి వచ్చే వైద్య విద్యా సంవత్సరం ఆరంభానికి అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన గుడిపేట–నంనూర్ తదితర నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల కోసం రూ.70 వేల పరిహారం అందరికీ త్వరగా అందేలా చూడాలని ఆర్డీఓ వేణుతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీపీ స్వర్ణలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పల్లె భూమేశ్, సాగి వెంకటేశ్వర్‌రావు, నాయకులు లగిశెట్టి రాజన్న, మొగిళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో సింగరేణికి ఏడు సీట్లు

శ్రీరాంపూర్: రామగుండంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సింగరేణికి ప్రత్యేక సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంబీబీఎస్‌లో ఈ కాలేజీలో మొత్తం 150 సీట్లు ఉండగా.. ఇందులో 23 సీట్లు ఆలిండియా కోటా, మిగతా 127 సీట్లు ఇక్కడి వారితో భర్తీ చేస్తారు. ఇందులో నుంచి 5 శాతం కోటా కింద 7 సీట్లను కంపెనీకి కేటాయించారు. నీట్‌లో వచ్చే మెరిట్ ప్రకారం ఈ సీట్లు భర్తీ చేస్తారు.

సేవలకు సమీకృత కలెక్టరేట్ సిద్ధం



కలెక్టరేట్‌లో ఫైళ్లను సర్దుతున్న సిబ్బంది

నస్పూర్: నస్పూర్‌లో ప్రారంభించిన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రజలకు సేవలు అందించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంచిర్యాలలోని కలెక్టరేట్ విభాగంలో ఉన్న ఫైళ్లు, కంప్యూటర్లు గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి తరలించారు. జూన్ 9న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభం కాగా ప్రస్తుతం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు, ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ సిబ్బంది మొత్తం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌కి తరలిరావడంతో ఇక్కడి నుంచే సేవలు అందించనున్నారు. ప్రజలు నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలోనే సంప్రదించాలని అధికారులు సూచించారు.

'ఆదాయ పన్ను ప్రభుత్వమే చెల్లించాలి'

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఆదాయ పన్నును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డ్ వల్ల వేతనాలు అధికంగా పెరిగాయని, ఈ పెరిగిన వేతనాలు ఆదాయ పన్నుకే పోతున్నాయని తెలిపారు. పలువురు కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రమేష్, కే.తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏనుగు బలపడేలా!

- తూర్పు జిల్లాలపై బీఎస్పీ దృష్టి
- సిర్పూర్ నుంచి ఆర్ఎస్పీ పోటీకి ప్రణాళిక
- బెల్లంపల్లి, చెన్నూరు రిజర్వు సీట్లపై నజర్
- నేడు మందమర్రిలో జిల్లా కార్యాలయం ప్రారంభం
- కాగజ్‌నగర్‌లో వారం రోజులు పాదయాత్ర



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు 'ఏనుగు' పార్టీ సిద్ధమవుతోంది. బహుజన్ సమాజ్‌వాది పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్(ఆర్ఎస్పీ) కుమురంభీం, మంచిర్యాల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఇటీవల కాలంలో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తరచూ పర్యటిస్తున్నారు. కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపుతున్నారు. ఇక్కడి సమస్యలపై స్పందిస్తున్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో జిల్లా కార్యాలయం ప్రారంభించనున్నారు. సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ పట్టణంలో వారం రోజులపాటు పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా పాదయాత్ర నిర్వహించనున్నారు. గతంలో ఈ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపట్టారు.

సిర్పూర్ నుంచి ఆర్ఎస్పీ

కుమురంభీం జిల్లా సిర్పూర్(జనరల్) నియోజకవర్గం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోటీ చేయించాలని అక్కడి పార్టీ శ్రేణులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే పార్టీ బలపడేందుకు పలుమార్లు సభలు, సమావేశాలు నిర్వహించారు. నాయకుల కోరిక మేరకు సిర్పూర్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధపడినట్లు కార్యకర్తలు చెబుతున్నారు. 2014అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఏనుగు గుర్తుపై ప్రస్తుత ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరి, 2018లో మళ్లీ గెలిచి కొనసాగుతున్నారు. ఈ క్రమంలో తమకు బహుజన వాదంతో వస్తున్న ఎస్సీ, బీసీ, మైనార్టీ ఓట్లు కలిసివస్తాయనే ధీమాలో ఉన్నారు. దీంతో ఇక్కడి నుంచే ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను పోటీ చేయించాలని పట్టుబడుతున్నారు. ఇటీవల బెజ్జూరు పర్యటనలోనూ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన సిర్పూర్ నుంచే బరిలో దిగే అవకాశాలు లేకపోలేదు. రిజర్వు స్థానం నుంచి కాకుండా జనరల్ స్థానం నుంచే పోటీలో ఉండాలనే ఆలోచనతో ఇక్కడ పోటీ చేస్తారని నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో కాగజ్‌నగర్‌లో వారం రోజులపాటు పట్టణ సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా పాదయాత్ర చేపట్టనున్నారు.

బెల్లంపల్లి, చెన్నూరుపై ఫోకస్..

మంచిర్యాల జిల్లా ఎస్సీ రిజర్వు స్థానాలైన బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ స్థానాలపై దృష్టి సారించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో మాజీ మంత్రి వినోద్ బీఎస్పీ నుంచి పోటీ చేశారు. ఆయన పది శాతం ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. టీఆర్ఎస్ అభ్యర్థికి 55026 ఓట్లు వస్తే, బీఎస్పీ అభ్యర్థికి 43750ఓట్లు వచ్చాయి. పార్టీ ఏనుగు గుర్తు ఇక్కడి ఓటర్లకు సుపరిచితమనే భావనతో ఇక్కడ కూడా బలమైన అభ్యర్థికి కోసం వేట మొదలుపెట్టారు. ఇక మరో ఎస్సీ రిజర్వు స్థానమైన చెన్నూరుపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ కూడా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. ఇటీవల నేతకాని సంఘ నేత, రియల్ వ్యాపారి దుర్గం అశోక్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. అశోక్ ప్రస్తుతం చెన్నూరు నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం చెన్నూరు నుంచి జిల్లా అధ్యక్షుడు ఎంవీ గుణ పార్టీ కార్యక్రమాలు చురుకుగా నిర్వహిస్తున్నారు.

'ఈవీఎం'పై విస్తృత అవగాహన



నస్పూర్‌లోని ఈవీఎం గోదాంలో గురువారం మాక్ పోలింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు

- ముగిసిన మొదటి దశ వెరిఫికేషన్
- ఈ నెల 10నుంచి ఓటర్లకు అవగాహన
- అక్టోబర్ వరకు కొనసాగనున్న కార్యక్రమం

సాక్షి ప్రతినిధి మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) పనితీరుపై మాక్ ఓటింగ్ ముగిసింది. గత నెల 23నుంచి గురువారం వరకు కొత్త కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ మాక్ పోలింగ్ పూర్తయింది. మొదట జిల్లాకు వచ్చిన ఈవీఎంలను సీయూ, బీయూ, వీవీ ప్యాట్స్‌ను పూర్తిగా తనిఖీ చేశారు. అందులోని ఐదు శాతం ఈవీఎంలను ర్యాండమ్‌గా ఎంపిక చేసి పరిశీలించారు. ఇక జిల్లాలో ఉన్న సాధారణ ఓటర్లకు ఈవీఎంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల జిల్లాకు హైదరాబాద్‌లోని 'ఈసీఐఎల్' సంస్థ నుంచి వచ్చిన ఈవీఎంపై పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయా? లేదా? పనితీరును తెలుసుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈవీఎం మెషిన్‌లో మొత్తం 96ఓట్లు వేసి సరిగా పని చేస్తున్నాయా? లేవా? అని పరీక్షించారు. ఇందుకోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు పర్యవేక్షించారు. అన్ని పరీక్షలు పూర్తయిన వాటికి స్టిక్కర్ వేశారు.

గ్రామాల్లో ఓటర్లకు అవగాహన

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఈవీఎంలు పని చేసే తీరు అందరికీ తెలిసేలా గ్రామాలు, పట్టణాల్లోనూ మాక్ పోలింగ్‌లో ఏర్పాటు చేయనున్నారు. ధ్రువీకరించిన ఈవీఎంల నుంచి 10శాతం ఎంపిక చేసి ఓటర్లకు అవగాహన కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 726 పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లకు అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం కలెక్టరేట్ ఆవరణ, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు తహసీల్దార్ కార్యాలయాల ముందు అవగాహన కల్పించేందుకు ఈవీఎంలను సిద్ధంగా ఉంచనున్నారు. వీటితోపాటు గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, పట్టణాల్లో వాడ వాడల్లోనూ మొబైల్ వ్యాన్లలో సంచారం చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఈవీఎంలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ నెల 10నుంచి ఈవీఎంలపై అవగాహన కల్పించే కార్యక్రమం మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. వచ్చే అక్టోబర్ వరకు ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో మొబైల్ వాహనంతో ప్రచారం చేసేలా ప్రణాళిక వేశారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆర్వో(రిటర్నింగ్ అధికారి)లను సైతం నియమించింది. ఆర్వోల సమక్షంలో వచ్చే ఎన్నికల ప్రక్రియ అంతా సాగనుంది.

మాక్‌పోలింగ్ సంతృప్తికరం



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్: ఈవీఎంలపై మాక్ పోలింగ్ ప్రక్రియ సంతృప్తికరంగా జరిగిందని, ఈ నెల 10 నుంచి ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే వరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రజలకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలోని నస్పూర్ ఈవీఎం గోదాములో ఎన్నికల అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం మాక్ పోలింగ్, ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ప్రథమ స్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 726 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. డీటీ శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ సూపర్‌వైజర్ డి.శ్రీరాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చిన ఈవీఎంలు			పరిశీలనలో ధ్రువీకరించినవి			తిరస్కరించినవి		
బీయూ	సీయూ	వీవీప్యాట్స్	బీయూ	సీయూ	వీవీప్యాట్స్	బీయూ	సీయూ	వీవీప్యాట్స్
1510	1206	1185	1563	1211	1188	53	05	03

(బీయూ:బ్యాలెటింగ్ యూనిట్, సీయూ:కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్:ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్)

అద్దె వాహనదారుల సమ్మె



డ్రైవర్ల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా కంపెనీకి అద్దె వాహనాల(కన్వేయన్స్)ను నడిపిస్తున్న యజమానులు గురువారం సమ్మె చేశారు. భూ నిర్వాసితులైన అద్దె వాహనాల ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏరియాల వారీగా ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు అందించగా.. అధికారుల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మె బాట పట్టారు. శ్రీరాంపూర్‌లో 116 వాహనాలు నిలిపివేసి సమ్మెలో పాల్గొన్నారు. జీఎం కార్యాలయం ఎదుట వాహనాలు నిలిపి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. వాహనాలు రాకపోవడంతో శ్రీరాంపూర్ జీఎం, అధికారుల ఇతర అధికారుల వాహనాల్లో విధులకు హాజరయ్యారు.

జైపూర్‌లో..

జైపూర్: జైపూర్ పవర్‌ప్లాంటు, ఇందారం ఐకే–ఓసీపీపై వాహనదారులు వాహనాలను నిలిపివేసి సమ్మెలో పాల్గొన్నారు. జైపూర్ పవర్ ప్లాంటు, ఐకే–1ఏ గనిపై వాహనాదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017నుంచి యూనిట్ రేటును పెంచలేదని, ఖర్చులు పెరిగినప్పటికీ అదే యూనిట్ రేట్‌తో వాహనాలను కొనసాగిస్తున్నట్లుగా తెలిపారు. మూడేళ్ల ఉన్న టెండర్ వాహనాలను ఆరేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల ఈపీఎఫ్, సీఎంపీఎఫ్‌లను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ వాహనదారుల ఓనర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు రామటెంకి తిరుపతి, నాయకులు మోహన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



జీఎం కార్యాలయం వద్ద భోజనాలు చేస్తూ నిరసన

కాసిపేటలో..

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీ ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ డ్రైవర్ల సమ్మె శిబిరాన్ని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు గురువారం సందర్శించి మద్దతు ప్రకటించారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రజమంలో బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలు కార్యాలయాలు, అధికారుల అద్దె వాహనాల యజమానులు గురువారం సమ్మె బాట పట్టారు. దిసింగరేణి భూ నిర్వాసితుల వెహికిల్స్ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొంగల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వాహన యజమానుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సీఎంపీఎఫ్‌ను పూర్తిగా రద్దు చేయాలని, యూనిట్ రేట్, వేరియేషన్ విధానాన్ని పొందుపరచాలని అన్నారు. డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

పోడు పట్టాల పంపిణీలో తెలంగాణ ఆదర్శం



నెన్నెలలో పట్టాలు అందజేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం నెన్నెల రైతు వేదికలో 166 మంది గిరిజనులకు 264 ఎకరాల భూమికి పోడు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు పట్టాలు అందుకున్న రైతులకు రైతుబంధు, రైతు బీమా వర్తిస్తాయన్నారు. గిరి వికాసం పథకం ద్వారా గిరిజన రైతులకు మేలు చేస్తున్నామని, పట్టాదారులు తమ భూముల్లో బోర్లు వేసుకునేందుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం చిత్తాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.60 లక్షలతో డార్మిటరీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, ఆర్డీఓ శ్యామల దేవి, ఎంపీడీఓ వరలక్ష్మీ, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీఓ శ్రీనివాస్, రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సర్పంచ్ తోట సుజాత, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

భీమినిలో..

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని రైతువేదికల్లో గిరిజనులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య గురువారం పోడు పట్టా పాస్ పుస్తకాలు అందజేశారు. భీమినిలో 42 మందికి, కన్నెపల్లిలో 102 మంది పోడు రైతులకు పట్టాలు అందజేశామని అన్నారు. అనంతరం భీమినిలో ఏడుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్యామల దేవి, జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, గంగక్క, ఎంపీపీలు పోతురాజుల రాజేశ్వరి, రాకేష్‌శర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, తహసీల్దార్లు రాంచందర్, లక్ష్మీరాజయ్య, ఎంపీడీఓ రాధాకిషన్, ఎంపీఓ సబ్దర్‌అలీ, సతీష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి'



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచి ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక ఆర్డినెన్సు జారీ చేసి రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించిందని తెలిపారు. బీసీల న్యాయమైన ఆకాంక్షను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, కో కన్వీనర్ సంగం లక్ష్మణ్, నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, కంచర్ల కొమురయ్య, తాడూరి శంకర్, రామస్వామి, శ్రీనివాస్, బోడంకి మహేష్, మొలుగూరి వెంకటేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన 'గురుకుల' విద్యార్థులు

- ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన



విద్యార్థులకు నచ్చచెబుతున్న ఎంఈవో

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ చేస్తూ విద్యార్థులు గురువారం తరగతులు బహిష్కరించారు. పాఠశాల నుంచి ఏఎంసీ ఏరియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే బైఠాయించి ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినదించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య, తాండూర్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు నరేష్, రవికుమార్ అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యార్థిపై చేయి చేసుకున్న ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న అంతర్గత ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని ఎంఈవో, పోలీసు అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను 'సాక్షి' సంప్రదించగా కొందరు విద్యార్థులు క్రమశిక్షణ తప్పి వ్యవహరిస్తున్నారని, నల్లా ట్యాప్‌లను విరగ్గొడుతున్నారని, ఇదే విషయమై మందలించడంతో ఆందోళనకు దిగారని తెలిపారు.

విత్తనాలు నాటి ఆదివాసీల నిరసన



విత్తనాలు వేస్తున్న ఆదివాసీలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన 60 మంది ఆదివాసీలకు అధికారులు పోడు భూములకు పట్టాలు రాకుండా చేశారంటూ పోడు భూముల్లో ఆదివాసీలు విత్తనాలు నాటి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌సీ కమిటీ చైర్మన్ నైతం మహేశ్ మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు అందించాలని శాంతియుత నిరసన తెలిపితే అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్, సంతోష్, సాయిచరణ్, శ్రావణ్, సమ్మన్న, మాణిక్యం, రజిని పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ పోరాటం'



సమస్యలు తెలుసుకుంటున్న దేవి భూమయ్య

కాసిపేట: కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేటగనిపై బాయిబాట కార్యక్రమంలో భాగంగా కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో ఐఎన్‌టీయూసీ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి కొన్నింటిని పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం కొందరు సూపర్‌వైజర్లు కార్మికుల డ్యూటీ అయిపోయినా లోపలే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులను వేధిస్తూ పని ఒత్తిళ్లకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వేధింపులు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామ్‌శెట్టి నరేందర్, ఏరియా కార్యదర్శి దొరిశెట్టి చెంద్రశేఖర్, నాయకులు బత్తుల వేణు, అరకొండ శేఖర్, గని ఫిట్ కార్యదర్శి రవీందర్, దేవరమేష్, అనిల్, బాల్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలువురి బైండోవర్



బైండోవర్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్

జన్నారం: సింగరాయిపేట్ గ్రామంలోని జియో టవర్ జనరేటర్ తాళాలు పగులకొట్టి డీజిల్ దొంగిలించేందుకు యత్నించారని జియో టెక్నీషియన్ పంచర్ల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము కుమార్, సారంగి అరవింద్, ఎంశాలి సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. విచారణ అనంతరం వారిలో సత్ప్రవర్తన రావడానికి గురువారం తహసీల్దార్ కిషన్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ అతిక్రమిస్తే రూ.లక్ష జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష ఉంటుందని తహసీల్దార్ వారిని హెచ్చరించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ ఉన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అందవెల్లి పెద్దవాగు వద్ద గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. బుధవారం దహెగాం మండలం దేవాజీగూడ గ్రామానికి చెందిన ఇడిదినేని మల్లయ్య (65) అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన వద్ద వాగు దాటుతుండగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయారు. ఈజీగాం ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా బోడపల్లి శివారులో మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య దుర్గక్క, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. జైనూర్ మండలంలోని పొలాసకు చెందిన లాల్ ఖాన్ ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై సాగర్ క్షతగాత్రుడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం దుకాణంలో చోరీ



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దొంగ చిత్రం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీవల్లి వైన్స్ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం నిర్వాహకుడు రెబ్బెన సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి రోజువారీగా మద్యం అమ్మకాలు ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి షెట్టర్ తెరిచి చూడగా దుకాణం పైకప్పు రేకులు తొలగించి ఉండడం గమనించారు. దుకాణంలో పరిశీలించగా సుమారు రూ.25 వేల నగదు, రూ.23 వేల విలువైన మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పెరిగిన జీతం కోతకే...

- కొత్త వేతనాలకు పన్నుపోటు
- 11వ వేతన ఒప్పందంలో పెరిగిన వేతనాలు
- 30 శాతం ఐటీ స్లాబ్ పరిధిలోకి సీనియర్ ఉద్యోగులు

కొత్త ఐటీ స్లాబ్ వివరాలు

ఐటీ స్లాబ్	పన్నుశాతం
రూ.3 లక్షల వరకు	–
రూ.3,00001 నుంచి రూ.6 లక్షలు	5 శాతం
రూ.6,00001 నుంచి రూ.9 లక్షలు	10 శాతం
రూ. 9,00001 నుంచి రూ.12 లక్షలు	15 శాతం
రూ. 12,00001 నుంచి రూ.15 లక్షలు	20 శాతం
రూ. 15 లక్షల పైనా	30 శాతం



శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గనుల్లో తమరక్తాన్ని చెమటగా మార్చి పనిచేసే ఉద్యోగులకు ఐటీ పోటు తలనొప్పిగా మారింది. ఇటీవల బొగ్గు గని కార్మికులకు 11వ వేతన ఒప్పందం జరిగింది. బేసిక్‌పై 19 శాతం వేతనాలతో పాటు పలు రకాల అలవెన్సులు కూడా పెరిగాయి. అయితే చాలా వరకు ఐటీకి పోతుందని ఉద్యోగులు వాపోతున్నారు.

30 శాతం ఐటీ స్లాబ్ పరిధిలోకి

పెరిగిన వేతనాలతో ప్రతీ ఉద్యోగి పన్ను చెల్లించే స్లాబ్ పరిధిలోకి వస్తున్నారు. మొదటి కేటగిరీ జనరల్ మజ్దూర్ నుంచి కనీసం 5 శాతం నుంచి ఆపై పన్ను పరిధిలోకి వచ్చారు. అతి తక్కువ మొదటి కేటగిరీ వేతనం ఉన్న కార్మికుడు కూడా ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. 10వ వేజ్‌బోర్డు పరిధిలో 20 శాతం స్లాబ్ పరిధిలో వచ్చిన సీనియర్ కార్మికులు ఇప్పుడు 30 శాతం పన్ను స్లాబ్‌కు మారుతున్నారు. దీంతో 19 శాతం ఎంజీబీ పెరిగితే స్లాబ్ మారడం వల్ల 10 శాతం అదనంగా ఐటీకి పోవడంతో మిగిలేది 9 శాతమే అని కార్మికులు వాపోతున్నారు.

‘సీ’ గ్రేడ్ క్లర్క్ వేతనాలు పరిశీలిస్తే..

మచ్చుకు ఓ సీగ్రేడ్ క్లర్క్ వేతనం పరిశీలిస్తే.. 10వ వేజ్‌బోర్డులో అనగా జూన్ నెల వేతనం అతను రూ.90,500 తీసుకున్నాడు. నెలనెలా వేతనం, మూడు నెలల బోనస్, లాభాల వాటా, పీఎల్ఆర్ బోనస్ లెక్కిస్తే ఏడాదికి అతని ఆదాయం రూ.1,45,700 లుగా ఉంది. దీంతో ప్రస్తుతం 20 శాతం ఐటీ పన్ను స్లాబ్ చెల్లిస్తున్నాడు. ఇప్పుడు 11వ వేతనంతో అతని వేతనం బేసిక్, అలవెన్సులన్నీ కలిపి జూలై నెలకు రూ.1,33,633 అయ్యింది. ఈ లెక్కన ఏడాదికి మొత్తం ఆదాయం సుమారు రూ.16,03,600 రానున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీంతో అతను 30 శాతం ఐటీ పన్ను చెల్లించాల్సి వస్తోంది. ఇతని సంపాదనలో కనీసం రూ.4,50,000 వరకు ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంది.

ఏరియర్స్‌తో మరింత ఐటీ

జూలై 1, 2021 నుంచి 11వ వేజ్‌బోర్డు కాలపరిమితి మొదలవుతుంది. దీంతో గడిచిన 23 నెలల ఏరియర్స్‌ను ఇప్పుడు చెల్లించబోతున్నారు. ఈ ఏరియర్స్ కూడా కార్మికుని ఆదాయం పరిధిలోనే లెక్కకు వస్తాయి. ఈ సంవత్సరం ఈ ఏరియర్స్ వల్ల అందరికీ మరింత ఐటీ ఎక్కువగా పడుతోంది. ఇదిలా ఉంటే కేంద్రం సారి కొత్త ఐటీ స్లాబ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. కొత్తగా తెచ్చిన ఐటీ పాలసీ వద్దనుకుంటే క్రితం ఏడాది ఐటీ పాలసీ ప్రకారం కూడా ఐటీ దాఖలు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దీనికి ముందుగానే ఏది కావాలో ఆప్షన్ పెట్టుకునే అవకాశం కల్పించింది. అయితే సీనియర్ కార్మికులు, చాలా మంది ఇంటి రుణాలు తీసుకున్న వారు పాత ఐటీనే ఆప్షన్ పెట్టుకున్నట్లు తెలిపారు. జూనియర్ ఉద్యోగులకు మాత్రం పాత దాని కంటే కొత్త ఐటీ పాలసీనే నయం అంటున్నారు.

జూలై నుంచి కొత్త వేతనాలు

కొత్త వేతనాలు జూలై నుంచి రానున్నాయి. జూన్ వేతనాలను జూలైలో ఇవ్వబోతున్నారు. వేజ్‌బోర్డు సంఘాల నేతలు కూడా ఏ కేటగిరీ ఉద్యోగికి ఎంత వేతనం వస్తుందో అంచనావేసి లెక్కచెబుతున్నారు. దీని ఆధారంగా కార్మికులు పెరిగిన వేతనం, దానిపై పడబోయే ఐటీ లెక్కలు చూసి ఖంగుతింటున్నారు. కొత్త జీతం ఎంత వస్తుంది? ప్రస్తుతం జూన్‌లో తీసుకున్న వేతనం ఎంత? ఈ రెండింటిపై పడే ఐటీ పన్నులను లెక్కలు వేసుకుంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

కేటగిరీ	పాత వేతనం(10వ వేజ్‌బోర్డు)	కొత్త వేతనం(11వ వేజ్‌బోర్డు)
డెయిలీ రేటెడ్ కేటగిరీ-1(రోజుకు)	రూ.1,011.27	రూ.1,502.22
మంత్లీ రేటెడ్ ఏ-1 గ్రేడ్ బేసిక్ (నెలకు)	రూ.98,485.79	రూ.1,46,341.67

ఆదాయపు పన్ను మాఫీ చేయాలి

చాలా ఏళ్లుగా కార్మికులు తమకు ఆదాయపు పన్ను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 9వ వేజ్‌బోర్డు నుంచి కార్మికులకు ఐటీ పోటు తప్పడం లేదు. దీంతో ప్రతి ఎన్నికల సమయంలో తాము గెలిస్తే ఆదాయపు పన్ను మాఫీ చేయిస్తామని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం చేయడం, చివరికి ఓట్లు దండుకున్న తరువాత మర్చిపోవడం చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. దేశ రక్షణలో ఉండే ఆర్మీ, త్రివిధ దళాలకు, రక్షణ రంగంలో ఉండే వారికి కేంద్రం ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇస్తోంది. కారణం వారు ప్రాణాలు పణంగా పెట్టి పని చేయడంతో వారిని రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. అయితే గనుల్లో కూడా కార్మికులు నిత్యం ప్రకృతికి విరుద్ధంగా అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పని చేయాల్సి ఉంటుంది. కావున తమను కూడా రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఐటీ మాఫీ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కోలిండియాలో అలవెన్సులపై పడే ఐటీని రీయింబర్స్‌మెంట్ చేస్తుండగా సింగరేణిలో కూడా అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీంతోనైనా కొంత వెసులుబాటు కలుగుతుందని వారు పేర్కొంటున్నారు.

కేకే ఓసీలో కొనసాగుతున్న సమ్మె



నిరసన దీక్షలో కాంట్రాక్టు డ్రైవర్లు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో కాంట్రాక్టు సంస్థ ఆర్‌వీఆర్ కంపెనీ అధికారుల తీరును నిరసిస్తూ కాంట్రాక్టు డ్రైవర్లు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపనీలో ఇతర చోట్లలో ఇచ్చిన మాదిరి తమకు వేతనాలు ఇవ్వాలని, అధికారుల హామీ మేరకు గతనెల సమ్మె వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళపై కేసు నమోదు

బెల్లంపల్లి: అక్రమంగా నివాసం ఉంటున్న సింగరేణి క్వార్టర్‌ను ఖాళీ చేయాలని ఆదేశించిన ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. బెల్లంపల్లి స్టేషన్‌రోడ్ కాలనీలోని డీ–182 క్వార్టర్ ఓ కార్మికుడికి అలాట్‌మెంట్ అయ్యిందని, గురువారం ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ పెయ్యాల సమ్మయ్య ఆ క్వార్టర్ వద్దకు వెళ్లి అందులో అనుమతి లేకుండా నివాసం ఉంటున్న చందన అనే మహిళను క్వార్టర్ ఖాళీ చేయాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. అందుకు ఆగ్రహం చెందిన సదరు మహిళ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌ను దూషించడంతో పాటు మరోసారి వస్తే చంపుతానని బెదిరించిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బెదిరింపులకు పాల్పడిన చందనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సర్వీస్ వైరే యమపాశమైంది...

- విద్యుత్ షాక్‌తో యువకుడు, రెండు గేదెలు మృతి
- సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతో ఘటన



రమాకాంత్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కును విద్యుత్ సర్వీసు వైరు రూపంలో మృత్యువు పొట్టనపెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడకు చెందిన జిట్టవేణి రమాకాంత్ (30)గురువారం పశువుల కాపరి రాకపోవడంతో తానే గేదెలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం గేదెలను తోలుకుని వచ్చి ఇంటిముందున్న షెడ్డు లోపలికి తోలాడు. లోపలికి వెళ్లిన గేదెలు పెద్దగా అరవడంతో లోనికి వెళ్లి అరుస్తున్న గేదెలపై చేయి వేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.



మృతి చెందిన గేదెలు

సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం

ఇంటికి సరఫరా చేసే విద్యుత్ సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం సంభవించి రెండు గేదెలు, వ్యక్తి మృతి చెందాడని విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ తెలిపారు. స్తంభం నుంచి మీటర్‌కు సరఫరా చేసే సర్వీస్ వైరు రమాకాంత్ ఇంటి ముందు ఉన్న రేకులషెడ్డుపై నుంచి వెళ్తుంది. సర్వీస్ వైరు ఇన్సులేషన్ ఫెయిల్ అయి తీగ తెగి రేకుల షెడ్డుకు తాకడంతో షెడ్డంతా విద్యుత్ సరఫరా అయినట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది గుర్తించారు.

సీఎం కేసీఆర్ చొరవతోనే అదనపు హక్కులు

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న రాజిరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే సింగరేణి కార్మికులకు అదనపు హక్కులు సాధించబడ్డాయని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో గురువారం నిర్వహించిన టీబీజీకేఎస్ గేట్‌మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేజ్‌బోర్డు ఒప్పందం ఈసారి 23 నెలలు ఆలస్యంగా జరిగినప్పటికీ జాతీయ సంఘాలు మెరుగైన ఒప్పందాన్ని సాధించలేకపోయాయన్నారు. సింగరేణి గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఉండటంతో సింగరేణి కార్మికులకు కోల్‌ఇండియాలో లేని అదనపు హక్కులు వచ్చాయన్నారు. సకల జనుల సమ్మె వేతనం చెల్లింపు, బేసిక్ మీద ఒక శాతం విద్యుత్ బిల్లు మినహాయింపు, రూ.10 లక్షల గృహరుణం, వడ్డీ చెల్లింపు, మహిళలకు ఉద్యోగాలు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం వంటి అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. ఈ సందర్భంగా 10 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పిట్ కార్యదర్శి రమేశ్, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, 11 మెన్‌కమిటీ సభ్యులు మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను అధికారులతో జీఎం సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల ఆదాయ పన్ను ఫైలింగ్, రీఫండ్ తదితర అంశాలపై శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి మంచిర్యాల ఆదాయపన్ను శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఉద్యోగులకు సంబంధించిన ఆదాయపన్ను చెల్లింపులు, రిఫండ్ సందర్భంగా తలెత్తే ఇబ్బందులు, ఇతర అంశాలను ఆ శాఖ అధికారులతో చర్చించారు. ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించడంలో సంస్థ ఎప్పుడు ముందుంటుందన్నారు. ఆదాయపన్ను శాఖ అధికారి వెంకట మాధవ్ మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు రిఫండ్ విషయంలో తెలిసి తెలియక తప్పిదాలు చేస్తున్నారన్నారు. ఏమైనా సందేహాలుంటే తమ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం ఎం.రవికుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ గోపాల్ సింగ్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, శివరావు, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ల సమీక్ష..

శ్రీరాంపూర్, ఇందారం ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓబి ఉత్పత్తి లక్ష్యాలపై కంపెనీ డైరెక్టర్లు ఎస్.బలరాం (ఫైనాన్స్), శ్రీనివాస్(ఆపరేషన్స్), జీ.వెంకటేశ్వర్ రెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమీక్షలో శ్రీరాంపూర్ నుండి ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఓబి లక్ష్యాలను పెంచితేనే బొగ్గు ఉత్పత్తి పెరుగుతుందని డైరెక్టర్లు సూచించారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, డీజీఎం చిరంజీవి పాల్గొన్నారు.

అద్దె వాహనాల సమ్మెపై జీఎం చర్చలు సమ్మె చేస్తున్న కంపెనీ అద్దె వాహనాల యాజమానులతో జీఎం సంజీవరెడ్డి చర్చలు జరిపారు.

ముందు బిల్లులివ్వండి..తర్వాతే విద్యార్థులొస్తారు

- ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవోతో హెచ్‌ఎం
- పాఠశాలను తనిఖీ చేసిన చాహత్ బాజ్‌పాయ్



తనిఖీ నిర్వహిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఆశ్రమ పాఠశాల తనిఖీకి వచ్చిన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు అనుకోని సంఘటన ఎదురైంది. గురువారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ ఆశ్రమోన్నత పాఠశాలలో పీవో తనిఖీకి వచ్చిన సమయంలో ఒక్క విద్యార్థి కూడా లేక పోవడంతో ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా విద్యార్థులు రాకపోవడంపై నిలదీశారు. విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. మరో నాలుగు రోజుల్లో తిరిగి తనిఖీ నిర్వహిస్తామని పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ముందుగా విద్యార్థుల భోజన బిల్లులు ఇవ్వాండి.. ఆ తర్వాతే విద్యార్థులు వస్తారని అన్నాడు. గతేడాది 8 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఈసారి గుత్తేదారు ఇంకా భోజన సరుకులు సరఫరా చేయలేదన్నాడు. స్పందించిన పీవో ప్రస్తుతం భోజనానికి సంబంధించి బిల్లులను సంబంధిత ప్రధానోపాధ్యాయులే భరించాలన్నారు. నివేదిక పంపిస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు.

విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలి

బెజ్జూర్: విద్యార్థులకు సర్దిచెప్పి బోధన అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బెజ్జూర్ మండలంలోని కుంటలమానేపల్లి, సలుగుపల్లి, బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇంటికి పంపవద్దని, త్వరలో ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర వస్తువులు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరామ్ ఉన్నారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా హెచ్‌ఎన్‌టీసీ నర్సరీని పరిశీలించారు.

‘ఎన్నికలు అడ్డుకుంటున్న గుర్తింపు సంఘం’

కాసిపేట: సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్‌లు కలిసి సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరగకుండా కోర్టుల పేరుతో అడ్డుకుంటున్నాయని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఎన్నికైన నాటి నుంచి కనీసం కార్పొరేట్ స్థాయి సమావేశాలు, ఏరియాలో జీఎంస్థాయి సమావేశాలు నిర్వహించక పోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, సహా కార్యదర్శి తిరుపతి గౌడ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాజేందర్, లింగయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

సూపర్ సాలరీ అకౌంట్లుగా మార్చుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు జీతాలు తీసుకునే అకౌంట్లను సూపర్ సాలరీ ఎకౌంట్లుగా మార్చుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ప్రమాద బీమా సౌకర్యం కల్పించిందని, దీని కొరకు కంపెనీ బ్యాంకులతో ప్రత్యేక ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఇది వరకే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా కార్పొరేట్ సాలరీ అకౌంట్లు కలిగిన ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో కూడా ఇదే ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇందులో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జీతం ఖాతా ఉన్న వారంతా వారి అకౌంట్‌లను సూపర్ సాలరీ అకౌంట్‌లుగా మార్చుకోవాలన్నారు.

ఐటీడీఏ నర్సరీల్లో పండ్ల మొక్కలు!

- పూర్వ వైభవం సంతరించుకుంటున్న ఉద్యాన నర్సరీలు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు
- అందుబాటులో కొబ్బరి, మునగ, మామిడి మొక్కలు
- రైతుల ఆర్థికాభివృద్ధికి అధికారుల ప్రత్యేక చర్యలు



భీమారం నర్సరీలో మామిడి మొక్కలు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉద్యాన వన నర్సరీలకు పూర్వవైభవం సంతరించేలా ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నెల రోజుల క్రితం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ రైతుల మేలుకోసం కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలను పెంచి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. పీవీటీజీ రైతులకు ఉద్యాన నర్సరీలో వ్యవసాయం, కూరగాయల సాగు, పండ్ల తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.

రైతులకు అందుబాటులో మొక్కలు

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగాలో నర్సరీలు కొనసాగుతున్నాయి. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడమే లక్ష్యంగా ఆయా నర్సరీల్లో కొబ్బరి, మామిడి, మునగ మొక్కలు అందుబాటులో ఉంచారు. ఉట్నూర్ నర్సరీలో 10 వేల కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉంచగా ఇప్పటికే 5,500 మొక్కల విక్రయాలు జరిగాయి. ఈ నాణ్యమైన మొక్కల ద్వారా కొబ్బరి బొండాలతో పాటు ఎండు కొబ్బరితో రైతులకు రెండు రకాల ఆదాయం చేకూరుతుంది. ఈ ఏడాది బెల్లంపల్లి, భీమారం, జంబుగాలో 25 వేల మామిడి మొక్కలు, 25 వేల మునగ మొక్కలు రైతులకు అందుబాటులోకి తేనున్నారు. మునగ మొక్కలు మరో 10 రోజుల్లో, మామిడి మొక్కలు 6 నెలల్లో విక్రయానికి సిద్ధం కానున్నాయి. సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు ఇప్పటికే విక్రయాలు జరిగాయి. మునగ మొక్కలు నాణ్యమైనవి కావడంతో తక్కువ సమయంలో కాయలు చేతికి వస్తాయి. రైతులు విక్రయించేందుకు ఎంతో దోహదపడనుంది. బయట మార్కెట్ కంటే ఐటీడీఏ నర్సరీల్లో తక్కువ ధరకే కొబ్బరి మొక్క రూ.50, మామిడి మొక్క రూ.45, మునగ మొక్క రూ.20 చొప్పున అందించనున్నారు. అంతే కాకుండా నీటి వసతి కలిగిన రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఆసక్తి కనబరుస్తున్నారు



ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు పంటల సాగుతో ఆర్థికంగా ఎదిగేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. విత్తనాలు, కూరగాయలు, పండ్ల తోటల ఏర్పాటు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉంచుతున్నాం. మొక్కలు నాటే విధానం, మెలకువలు, పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సందీప్‌కుమార్, ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి

గర్భిణులకు స్కానింగ్ కష్టాలు

జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ కష్టాలు తప్పడం లేదు. రోజుకు 150కు పైగా గర్భిణులు వైద్యపరీక్షలకోసం వస్తుండగా స్కానింగ్ కోసం ఇద్దరు రేడియాలజిస్టులను నియమించారు. ఉదయం 9 గంటలకు ఓపీ సేవలు ప్రారంభంకాగా వారు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసి మధ్యాహ్నం 12 గంటల తర్వాత వస్తుండడంతో గర్భిణులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– మంచిర్యాలటౌన్

